క్లుప్తంగా

మంత్రిని కలిసిన ఏపీయూడబ్ల్యూజే నేతలు



నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఏపీయూడబ్ల్యూజే నేతలు మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని కమిటీ జిల్లా అధ్యక్షుడు వీ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సీహెచ్ మస్తాన్‌రెడ్డి, తదితరులు సత్కరించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలను మంత్రికి తెలియజేశారు. నేతలు జయప్రకాష్, హనోక్, రవికుమార్, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



నెల్లూరు(బృందావనం): తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వరుని సన్నిధిలో నెల్లూరుకు చెందిన కళాకారిణి భవ్యహాసిని నిర్విరామ నాట్యప్రదర్శనతో జూలై 16న చేపట్టనున్న ఐదు గంటల గిరి ప్రదక్షిణ మహాసంకల్పం సిద్ధించాలని గాంధీబొమ్మ సమీపంలోని షిరిడీ సాయిబాబా మందిర కమిటీ సభ్యుడు శ్యామ్‌సుందరరెడ్డి కాంక్షించారు. మందిరంలో భవ్యహాసిని మూడు గంటల నాట్య ప్రదర్శనను గురువారం ఆయన ప్రారంభించారు. భవ్యహాసిని తల్లిదండ్రులు చెంచులక్ష్మి, సునీల్‌కుమార్, నాట్య గురువులు కళాదీప్తి సుబ్రహ్మణ్యం, కామాక్షిని అభినందించారు.

తక్కువ నీటి వినియోగంతో పంటల సాగు

పొదలకూరు: రైతులు తక్కువ నీటి వినియోగంతో చిరుధాన్యాల పంటలను సాగు చేసుకోవాలని పొదలకూరు చిరుధాన్య పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త ఒ.వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక పరిశోధనా స్థానం సమావేశ మందిరంలో గురువారం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో పొదలకూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని వీఏఏలు, వీహెచ్ఏలు, వీఎస్ఏలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాదిని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిందని తెలిపారు. చిరుధాన్యాల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయని, వీటిని సాగు చేయడం ద్వారా భూమిలో వృద్ధి చెందే అనేక రకాల పురుగులను నివారించవచ్చని తెలిపారు. జిల్లా శిక్షణ సమన్వయకర్త సత్యవాణి మాట్లాడుతూ గ్రామాల్లో పొలంబడి కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించి రైతులకు సాంకేతిక వ్యవసాయంపై అవగాహన పెంపొందించాలని సూచించారు. పొలంబడి కార్యక్రమాల్లో వ్యవసాయ ఖర్చులు తగ్గించుకోవడం, మిత్రపురుగులు, మందుల పిచికారీ, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలను వివరించాలని తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీమాధవి మాట్లాడుతూ భూసార పరీక్షలు, ఉపయోగాలు, భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పొదలకూరు ఏడీఏ కె.శివనాయక్ మాట్లాడుతూ ఈ–క్రాప్ బుకింగ్ ఉపయోగాలు, ఈకేవైసీ చేయించుకోవడం, ప్రభుత్వం వ్యవసాయరంగానికి అందిస్తున్న రాయితీలను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఓ ఈ.ఆనంద్, పొదలకూరు ఏఓ ఎ.వాసు, కలువాయి, చేజర్ల, రాపూరు, మనుబోలు ఏఓలు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

వెంకటాచలం: విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడంపై ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులకు రాజీవ్‌గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చారు. వెంకటాచలం మండలం కాకుటూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి 30 మంది ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ ఆచార్యులు వాసంతి రాజేంద్రన్, వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, డాక్టర్ సునీత, డా.డేవిడ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో జాబ్‌మేళా

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో గురువారం బాలాజీ ప్లేస్‌మెంట్స్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు దాదాపు 150 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరు కాగా, వారిలో 80 మంది పలు కంపెనీల్లో ఉద్యోగాలు పొందినట్లు వీఎస్‌యూ ప్లేస్మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ సాయి ప్రవంతి తెలిపారు. ఈ జాబ్‌మేళాకు టెక్ మహేంద్ర, హెచ్.సి.ఎల్, జొమోటో తదితర కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.

ఉపాధ్యాయుల కృషితోనే ఉత్తమ ఫలితాలు

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి
- అట్టహాసంగా 'జగనన్న ఆణిముత్యాలు'
- విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: పదో తరగతి ఫలితాల్లో రూరల్ నియోజకవర్గ స్థాయిలో కేఎన్నార్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. జగనన్న ఆణిముత్యాలు, విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నగరంలోని కేఎన్నార్ స్కూల్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేఎన్నార్ పాఠశాల విద్యార్థులు ఏటా ఉత్తమంగా రాణిస్తున్నారని కొనియాడారు. ఉపాధ్యాయుల కృషి కారణంగా పాఠశాలకు ఉత్తమ ఫలితాలు లభిస్తున్నాయని వివరించారు. పాఠశాలకు పూర్తిస్థాయిలో అధునాతన మౌలిక వసతులను కల్పించారన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీర్చిదిద్దారని తెలిపారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పూర్తిస్థాయిలో వసతులను కల్పించేందుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యారంగ అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని విధంగా కృషి చేస్తోందని చెప్పారు.

పతకాల ప్రదానం

పదో తరగతి పరీక్షల్లో రూరల్ నియోజకవర్గ స్థాయిలో 593 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన కేఎన్నార్ స్కూల్ విద్యార్థి గోకుల్‌కృష్ణారెడ్డికి గోల్డ్ మెడల్, 587 మార్కులు సాధించిన మానసకు రజత పతకాన్ని అందజేశారు. 583 మార్కులు సాధించిన దర్గామిట్టలోని జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థిని దేవర్షిణికి కాంస్య పతకాన్ని అందజేశారు. వీరికి ప్రశంసపత్రంతో పాటు వరుసగా రూ.15 వేలు, రూ.పది వేలు, రూ.ఐదు వేలను ప్రదానం చేశారు. ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన నలుగురు విద్యార్థులకు రూ.15 వేల చొప్పున పంపిణీ చేశారు.

‘జగనన్నకు చెబుదాం’పై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జగనన్నకు చెబుదాంపై ప్రత్యేక దృష్టి సారించి దరఖాస్తుల పరిష్కార క్రమంలో మరింత మెరుగైన విధానాన్ని అవలంబించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై కలెక్టరేట్లో అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. దరఖాస్తులు సచివాలయ పరిధిలో ఎందుకు పరిష్కారం కావడం లేదో తెలుసుకునే విధానాన్ని అమలు చేయాలని సూచించారు.

జగనన్నకు చెబుదాంలో వచ్చే సమస్యల పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేయడంలో జెడ్పీ సీఈఓ చిరంజీవి సమర్థంగా పనిచేస్తున్నారని, మరింత మెరుగ్గా నిర్వహించడానికి వినూత్న ఆలోచన చేయాలని సూచించారు. సమస్య మూలాల్లోకి వెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. నెల్లూరు నగరపాలక సంస్థ, పోలీస్ శాఖలో అనుసరిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ విద్యాధరి, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీఎల్డీఓ వసుమతి, సీపీఓ రాజు, డీఎస్పీ శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎంపీ ఆదాల

నెల్లూరు రూరల్: నియోజకవర్గంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తామని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 17వ డివిజన్లోని ధనలక్ష్మీపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. సంక్షేమ పథకాల లబ్ధిపై కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు నేరుగా అందిస్తున్నామని వివరించారు. ఆయా ప్రాంతాల్లోని సమస్యలను తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీకాలను సకాలంలో వేయాలి



మాట్లాడుతున్న సెలీనాకుమారి

నెల్లూరు(అర్బన్): తల్లీబిడ్డలకు వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో వేయించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సెలీనాకుమారి పేర్కొన్నారు. సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆశ నోడల్ అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. హైరిస్క్ గర్భిణులపై ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు మరింత అప్రమత్తంగా ఉండి వారికి సకాలంలో పరీక్షలను చేయించాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, ఇవి జరగకుండా చూడాలని ఆదేశించారు. డీపీహెచ్ఎన్ఓ మంజుల, డెమో అధికారి శ్రీనివాసరావు, హెచ్ఈఈఓ నరసింహరావు, డీసీఎం సునీత, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



నెల్లూరు రూరల్: సీఎం సహాయనిధి చెక్కును ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. నగరంలోని తన నివాసంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఉదయగిరికి చెందిన చిన్నయ్యకు రూ.65 వేల చెక్కును ఎంపీ అందజేశారు.

జీజీహెచ్‌లో వైద్య శిబిరం నేడు

నెల్లూరు(వేదాయపాళెం): నగరంలోని జీజీహెచ్‌లో ఉచిత మెడికల్ క్యాంప్, కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి నిర్మలాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లింలు, ఎస్సీ, ఎస్టీ, ఇతర మైనార్టీలు హాజరై పరీక్షలు చేయించుకోవాలని కోరారు. వివరాలకు 86398 84313 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు సిటీ: చిన్నబజార్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా అశోక్‌కుమార్ బాధ్యతలను గురువారం స్వీకరించారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్ విధులు నిర్వర్తిస్తున్న సురేంద్రబాబు దాచేపల్లికి బదిలీ అయ్యారు. ఈ క్రమంలో రేంజ్ వీఆర్‌లో ఉన్న అశోక్‌కుమార్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, ఏఎస్పీ హిమవతి, నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డిని ఇన్‌స్పెక్టర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

నేత్రపర్వంగా వెండినంది ఉత్సవం



నెల్లూరు(బృందావనం): త్రయోదశిని పురస్కరించుకొని మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో విశేష పూజలను గురువారం నిర్వహించారు. స్వామివారు వెండినంది ఉత్సవంలో దర్శనమిచ్చారు. భక్తులు విశేషంగా హాజరయ్యారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్ప దేవస్థాన ప్రాంగణంలో కొలువైన గురువాయూర్ మహావిష్ణు దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. మహాకుంభారాధన, నిత్యహోమం, నివేదన, శాత్తుమొరై, హయగ్రీవహోమం, నవకలశ స్నపన తిరుమంజనం, చక్రస్నానం, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ధ్వజావరోహణం, మహాకుంభప్రోక్షణ, ఏకాంతసేవను రాత్రి జరిపారు. ఉభయకర్తలుగా మేడికొండ పద్మమోహన్, స్నేహ దంపతులు, అర్జున్ నాగసాయిరామ్, అద్వితవ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, మోహన్‌రావు, శంకర్, మురళీమోహన్‌రెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

యోగా దినోత్సవ విజయవంతానికి పిలుపు



మాట్లాడుతున్న గోవిందయ్య

నెల్లూరు(అర్బన్): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గల ఇండోర్ స్టేడియంలో ఈ నెల 21న నిర్వహించనున్న ప్రపంచ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయుష్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ గోవిందయ్య పిలుపునిచ్చారు. మూలాపేటలో ఆయుష్ డాక్టర్లతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 6.30 నుంచి 8.30 వరకు కార్యక్రమాలను నిర్వహించనున్నామని వివరించారు. జిల్లా అధికారులు, యోగా గురువులు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

సీనియర్ సిటిజన్లను గౌరవించాలి



నెల్లూరు రూరల్: సీనియర్ సిటిజన్లను గౌరవించాల్సిన బాధ్యత కుటుంబసభ్యులపై ఉందని ఆర్డీఓ మలోల పేర్కొన్నారు. ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీనియర్ సిటిజన్ల సంరక్షణకు పలు చట్టాలున్నాయని చెప్పారు. సీనియర్ సిటిజన్స్ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సూర్యప్రకాష్, శేషయ్య, జయప్రకాష్, రామ్మోహన్‌రావు, రామ్మూర్తి, సుబ్బారావు, శ్రీమన్నారాయణ, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా బదిలీల ప్రక్రియ



బదిలీలకు కౌన్సెలింగ్



పరిశీలిస్తున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): సచివాలయ కార్యదర్శుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో సచివాలయ కార్యదర్శుల బదిలీల ప్రక్రియను గురువారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. నెల్లూరు నగరపాలక సంస్థ, మునిసిపాల్టీలు, నగర పంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తున్న వార్డు సచివాలయ కార్యదర్శుల ఆన్‌లైన్ అభ్యర్థన మేరకు బదిలీల ప్రక్రియను నిర్వహిస్తున్నామని చెప్పారు. నిర్దేశించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను తప్పక పాటించాలని సూచించారు. 2019 / 20 వార్డు సచివాలయ సెక్రటరీల నియామకం, ర్యాంక్, మార్కుల ప్రాధాన్యం మేరకు బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్పొరేషన్ అధికారులు, ఇతర పురపాలక సంఘాల కమిషనర్లు, నగర పంచాయతీలను సమన్వయం చేసుకొని సజావుగా నిర్వహించాలని కోరారు.

కూలీల సంఖ్యను పెంచండి



మాట్లాడుతున్న వెంకట్రావ్

నెల్లూరు(పొగతోట): ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచాలని డ్వామా పీడీ వెంకట్రావ్ ఆదేశించారు. డ్వామా కార్యాలయం నుంచి వివిధ మండలాల అధికారులతో గురువారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందేలా పనులను గుర్తించి వాటిని కూలీలతో చేయించాలని సూచించారు. కూలీలకు రోజుకు రూ.250 వేతనం తగ్గకుండా చూడాలని చెప్పారు. పనులకు సంబంధించిన వివరాలను సేకరించి ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కూలీలకు సకాలంలో వేతనాలు వారి బ్యాంక్ ఖాతాల్లో జమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి పనుల అమల్లో అక్రమాలకు పాల్పడే సిబ్బందిపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ప్లాంటేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం



రూ.లక్షను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు శ్రీనివాసులురెడ్డి, సహదేవరెడ్డి, బాలు, ప్రసాద్‌రెడ్డి ద్వారా వెంకటసుబ్బారెడ్డికి అందజేశారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ యువకుడి వైద్యానికి రూ.లక్షను నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అందజేశారు. నగరంలోని 53వ డివిజన్ వెంకటేశ్వరపురంలో గల నల్లకాలువకు చెందిన చిలకల వెంకటసుబ్బారెడ్డి కుమారుడు సుజిత్‌రెడ్డి సీఏ చదువుతున్నారు. ఈ క్రమంలో ఇంటి నుంచి బైక్‌పై నగరానికి వెళ్తుండగా, పెన్నా బ్రిడ్జిపై మినీ వ్యాన్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయన గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే వైద్య ఖర్చుల నిమిత్తం రూ.లక్షను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు శ్రీనివాసులురెడ్డి, సహదేవరెడ్డి, బాలు, ప్రసాద్‌రెడ్డి ద్వారా వెంకటసుబ్బారెడ్డికి అందజేశారు.

ఘనంగా అమరావతి కృష్ణారెడ్డి జన్మదినం



నెల్లూరు(బృందావనం): గాంధీబొమ్మ సమీపంలోని అమరావతి చాంబర్స్‌లో 25 కళాసంఘాల అధ్యక్షుడు, హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలను గురువారం నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో అన్నదానం, వస్త్రదాన కార్యక్రమాలను చేపట్టారు. కృష్ణారెడ్డిని పలువురు సత్కరించారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. కళాసంఘాల కన్వీనర్లు దొర్నాల హరిబాబు, అమీర్‌జాన్, భాస్కర్, నేదురుమల్లి హరనాథ్‌రెడ్డి, కోసూరు రత్నం, తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల అందజేత



నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని గీతామయి బాలభవన్‌లో విద్యార్థులకు మిఠాయిలు, నోట్ పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు జన్మదినాన్ని పురస్కరించుకొని రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. కార్మిక శాఖ విశ్రాంత అధికారి రఘు, రాయప్ప, ఉపాధ్యాయురాలు అపర్ణ, బాలభవన్ నిర్వాహకుడు పాండు, తదితరులు పాల్గొన్నారు.

‘డీకేడబ్ల్యూ’లో ఈ నెల 19 నుంచి అడ్మిషన్లు

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియను ఈ నెల 19 నుంచి ప్రారంభించనున్నామని ప్రిన్సిపల్ గిరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి బీఏ హానర్స్ (హిస్టరీ, ఎకనమిక్స్, పొలిటికల్ సైన్స్, స్పెషల్ తెలుగు, ఇంగ్లిష్, స్టాటిస్టిక్స్ – నాన్ మ్యాథ్స్), బీకాం హానర్స్ (బీకాం జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్, బ్యాంకింగ్ అండ్ ఇన్సూరెన్స్), బీఎస్సీ హానర్స్ (మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్, జువాలజీ, బయోటెక్నాలజీ, ఆక్వాకల్చర్, బొటనీ, హోమ్ సైన్స్, కెమిస్ట్రీ), తదితర కోర్సులను ప్రవేశపెట్టామని చెప్పారు. అడ్మిషన్లకు సంబంధించిన వివరాలకు 86397 34668 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నీట్, ఏపీఈఏపీ సెట్‌లో ‘శ్రీచైతన్య’ విజయభేరి



రియాన్‌బాషా



భూపాల్‌రెడ్డి



సాయిదీపక్

నెల్లూరు (టౌన్): నీట్, ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనాన్ని ఎగురవేశారని కళాశాల డీన్ శ్రీరామ్ పేర్కొన్నారు. ర్యాంకులను సాధించిన విద్యార్థులను అన్నమయ్య సర్కిల్లోని కళాశాలలో గురువారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. నీట్‌లో రియాన్‌బాషా 599, మాధవి 589, తేజశ్రీ 570 మార్కులను సాధించారని చెప్పారు. ఏపీఈఏపీ సెట్ ఇంజినీరింగ్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో భూపాల్‌రెడ్డి 1195, వెంకటసాయిదీపక్ 1684 ర్యాంకులను సాధించారని తెలిపారు. ఐదు వేలకు పైగా 18 మంది, పది వేలకుపైగా ర్యాంకులను 45 మంది సాధించారని వివరించారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో డ్రైవర్ల పోస్టుల భర్తీకి చర్యలు

నెల్లూరు(అర్బన్): నెల్లూరు సిటీ, కావలి, కందుకూరు పరిధిలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ 102 వాహనాల్లో ఖాళీగా ఉన్న డ్రైవర్ పోస్టులను భర్తీ చేయనున్నామని వాహనాల జిల్లా మేనేజర్ వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై మినిమమ్ బ్యాడ్జి / హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్న వారు అర్హులని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత డాక్యుమెంట్లతో జీజీహెచ్ ఆవరణలోని తమ కార్యాలయాన్ని శనివారం లోపు సంప్రదించాలని కోరారు. వివరాలకు 90007 44043 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

108లో ఈఎంటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని 108 వాహనాల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ) పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని 108, 104 వాహనాల జిల్లా మేనేజర్ పవన్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మనుబోలు, తోటపల్లిగూడూరు, సంగం, బుచ్చిరెడ్డిపాళెం, చేజర్ల, పొదలకూరు, వలేటివారిపాళెం, ఉలవపాడు, కావలి, అల్లూరు, కొడవలూరు, తదితర మండలాల్లో ఈఎంటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, ఐదేళ్ల అనుభవంతో కూడిన క్యాథ్‌ల్యాబ్, డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, అనస్థీషియా టెక్నీషియన్, తదితర కోర్సులు చేసిన వారు అర్హులని చెప్పారు. ఆసక్తి గల వారు సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో గల 108 కార్యాలయంలో దరఖాస్తులను ఈ నెల 20లోపు అందజేయాలని కోరారు. వివరాలకు 87900 69434 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కాంగ్రెస్ నేతల ప్రచారం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని బలపర్చాలని కోరుతూ ఇంటింటి ప్రచారాన్ని ఆ పార్టీ నేతలు గురువారం చేపట్టారు. జాకీర్‌హుస్సేన్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నేతలు డాక్టర్ యశోధర, గోపీ, మానస, నీలవాణి, సీమా, వహీద్, అనూష, చిన్నయ్య, మున్నా, మహబూబ్‌జాన్, తదితరులు పాల్గొన్నారు.